క్లుప్తంగా

పార్టీ అధినేతతో కామిరెడ్డి భేటీ



మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కందుకూరు నియోజకవర్గ పార్టీ పరిశీలకులు, డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఏడాదన్నర కూటమి పాలనలో అధికార పార్టీ నేతలు చేస్తున్న ఆగడాలు, దౌర్జన్యాలతో పాటు తనపై బనాయించిన 14 అక్రమ కేసుల వివరాలతో కూడిన ఫైల్‌ను పార్టీ అధినేత జగనన్నకు అందజేసినట్లు పేర్కొన్నారు.

పోలేరమ్మ హుండీ ఆదాయం రూ.3 లక్షలు



హుండీ లెక్కింపులో విద్యార్థులు, అధికారులు

నాయుడుపేటటౌన్: స్థానిక గ్రామ దేవత పోలేరమ్మ ఆలయంలోని హుండీలో నగదు బుధవారం దేవదాయశాఖ అధికారులు, ఆలయ కమిటీ, గ్రామపెద్దల సమక్షంలో నగదు లెక్కించారు. హుండీలలో నగదును స్థానిక సీవీ రామన్ డిగ్రీ కళాశాల విద్యార్థులతో లెక్కించగా మొత్తం రూ.3,00,900 ఆదాయం వచ్చినట్లు స్థానిక ఆలయ కార్యనిర్వహణాధికారి మునుసూరి రవికృష్ణ తెలిపారు. తూర్పు కనుపూరు ముత్యాలమ్మ ఆలయ ఈఓ నవీన్‌కుమార్ పర్యవేక్షణలో కమిటీ అధ్యక్షులు నానబాల సుబ్బారావు, కృష్ణారెడ్డి, తదితరుల సమక్షంలో నగదు లెక్కింపు చేపట్టారు. ఈ నగదును పోలేరమ్మకు సంబంధించిన బ్యాంకు ఖాతాలో జమచేయనున్నట్లు వెల్లడించారు.

చిరు ధాన్యాలతోనే ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సునంద

సైదాపురం: ఆరోగ్యకరంగా ఉండాలంటే చిరు ధాన్యాలు తప్పనిసరిగా తీసుకోవాలని గిద్దలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చరిష్మా కోరారు. రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని కలిచేడు అంగన్‌వాడీ కేంద్రంల్లో బుధవారం పోషకాహారాన్ని ప్రదర్శించారు. ఆమె మాట్లాడుతూ చిరుధాన్యం ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడుతాయన్నారు. రాపూరు సీడీపీఓ సునంద మాట్లాడుతూ ఆకుకూరలు, చిరుధాన్యాలు తదితర పోషకాహారాలపై అవగాహన కల్పించారు. అనంతరం బాల్య దశలో పిల్లల సంరక్షణ, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారం తయారీపై అవగాహన కల్పించారు.

గూడూరు జిల్లా కోసం పోరాటం



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ ఐక్యవేదిక నాయకులు

కోట: గూడూరును జిల్లా కేంద్రంగా చేయాలి లేదా గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని ఉద్యోగ, ఉపాధ్యాయ ఐక్యవేదిక కోరింది. ఉద్యోగ, ఉపాధ్యాయ ఐక్యవేదిక వాకాడు తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ జయజయరావుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ కార్యాలయాలు తిరుపతిలో ఉండడం వలన ఉద్యోగుల కార్యకలాపాలు కష్టతరంగా మారుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు టి.క్రిష్ణయ్య, సుమాయిష్, భోగేశ్వరం, మనోహర్ పాల్గొన్నారు.

గాలికుంటు టీకాలు వేయాలి


కోట: మూగజీవాలకు వచ్చే గాలికుంటు వ్యాధిపై పాడి రైతులకు అవగాహన కలిగించాలని పశుసంవర్ధకశాఖ ఏడీ సుబ్రమణ్యం సూచించారు. కార్యాలయంలో బుధవారం డాక్టర్లు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు వెల్లడించారు. అక్టోబర్ 15వతేదీలోపు అన్ని పశువులకు వందశాతం వ్యాక్సినేషన్ చేపట్టాలన్నారు. వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

చికెన్ ధరలు 25-09-2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	:	117
లేయర్ లైవ్	:	110
బ్రాయిలర్ చికెన్	:	214
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	236
లేయర్ చికెన్	:	187

ప్రధాని ఐకే గుజ్రాల్‌తో.. (ఫైల్)



ప్రధాని వాజ్‌పాయ్‌తో సతీష్ ధవన్ (ఫైల్)



రాకెట్ ధవన్

- అంతరిక్ష శాస్త్రవేత్తల్లో అగ్రగణ్యులు సతీష్ ధవన్
- విప్లవాత్మక మార్పులకు శ్రీకారం
- రూపాయి జీతంగా తీసుకున్న శాస్త్రవేత్త

సూళ్లూరుపేట : భారత అంతరిక్ష ప్రయోగాల్లో ప్రొఫెసర్ సతీష్ ధవన్‌ది ఒక సువర్ణ అధ్యాయమని చెప్పాలి. నెలకో రూపాయి జీతం తీసుకుని ఇస్రోలో పనిచేసి ఈ దేశానికి ఉపగ్రహాల సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకొచ్చిన వారిలో ఆయన అగ్రగణ్యులు. దేశ ప్రజలకు అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలని అనుక్షణం పరితపించే వారు. భారత తొలి అంతరిక్ష పితామహుడు విక్రమ్‌సారాభాయ్ అయితే ఆయన మరణానంతరం ఆయన కన్న కలలను సాకారం చేసింది మాత్రం ప్రొఫెసర్ సతీష ధవన్. డాక్టర్ విక్రమ్‌సారాభాయ్ మన అంతరిక్ష విజ్ఞానాన్ని బుడి బుడి అడుగులతో నడిపిస్తే ధవన్ దాన్ని దారిలో పెట్టి భారీ రాకెట్లు, ఉపగ్రహాలు తయారు చేసుకుని గ్రహాంతర ప్రయోగాలే చేసే స్థాయికి ఎదిగేందుకు కారణమయ్యారు. ఇస్రో తొలినాళ్లలో చిన్న తరహా రాకెట్ ప్రయోగాలతో ప్రారంభమై పెద్ద పెద్ద ఉపగ్రహాలను రోదసీలోకి ప్రవేశపెట్టే స్థాయికి చేరడంలో ఆయన పాత్ర అమోఘమైంది. 1975 ఆగస్టు 1 నుంచి 1976 జులై 31 వరకు ప్రయోగించిన సమాచార ఉపగ్రహాలతో ఆరు రాష్ట్రాల్లో 2400 గ్రామాలను అనుసంధానించి టెలివిజన్ ద్వారా దూరవిద్యా సదుపాయాన్ని (టెలీ ఎడ్యుకేషన్) ఆనాడే కల్పించగలిగారు. ఆయన ఆలోచనల్లో నుంచి పుట్టిందే పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ రాకెట్‌లు. నేడు పీఎస్ఎల్‌వీ రాకెట్ ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతి చెందింది. ఇస్రోకు ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ గురువారం ఆయన జయంతి సందర్భంగా ఈ ప్రత్యేక కథనం



షార్‌లో ప్రధాని ఇందిరాగాంధీతో సతీష్‌ధవన్ (ఫైల్)

సతీష్ ధవన్ ప్రస్థానం



శ్రీనగర్‌లో 1920 సెప్టెంబర్ 25న ధవన్ జన్మించారు. ఆయన గణితం, భౌతికశాస్త్రంలో బీఏ వరకు చదివారు. అనంతరం ఎంఏ ఇంగ్లిష్ లిటరేచర్ చేశారు. ఆ తరువాత మెకానికల్ ఇంజినీరింగ్‌లో పట్టభద్రులయ్యారు. కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి వైమానిక శాస్త్రంలో, గణితంలో పీహెచ్‌డీ చేసి డాక్టరేట్‌ను పొందారు. విద్యను పూర్తి చేసిన ఆయన 1951లో స్వదేశానికి విచ్చేసిన వెంటనే బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌లో అధ్యాపకుడిగా చేరారు. 1962లో ఆ సంస్థకు డైరెక్టర్ అయ్యారు. 1972లో అంతరిక్ష పితామహులు డాక్టర్ విక్రమ్ సారాభాయ్ మరణానంతరం ఇస్రో బాధ్యతలను ధవన్‌కు అప్పగించారు. బెంగళూరు ఐఐటీకి డైరెక్టర్‌గా కొనసాగుతూనే ఇస్రో చైర్మన్ బాధ్యతలు నిర్వహిస్తూ నెలకు ఒక్క రూపాయి మాత్రమే జీతంగా తీసుకున్నారు. సమాచార వ్యవస్థ, వాతావరణ పరిశోధన, భూమిలో దాగివున్న ఖనిజ సంపద ఉనికిని తెలుసుకోవడం కోసం బహుళ ప్రయోజనాలకై సొంతంగా ఉపగ్రహాలను తయారుచేసి ప్రయోగించాలనే డాక్టర్ విక్రమ్‌సారాభాయ్ కన్నకలలను ధవన్ నిజం చేశారు. ఇస్రో చైర్మన్ అయిన వెంటనే మన తొలి ఉపగ్రహం ఆర్యభట్ట, భాస్కర, యాపిల్ ఉపగ్రహాలను నిర్మించి ఎస్ఎల్‌వీ ద్వారా ప్రయోగించారు. ఇన్‌శాట్, ఐఆర్ఎస్, తరమా ఉపగ్రహాల నిర్మాణ ప్రణాళికలు తయారు చేశారు. భారత అంతరిక్ష పరిశోధనా యాత్రలో ఆయన శకం ముఖ్యమైన మైలురాయిగా చెప్పుకోవచ్చు. అందుకే ఆయన పేరును శ్రీహరికోట రాకెట్‌కేంద్రానికి 2002 సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌గా నామకరణం చేసి ఇస్రో ఘనమైన నివాళిని ఆయనకు అర్పించింది. షార్‌లోని రెండోగేటుకు అవతల వైపున సతీష్‌ధవన్ విగ్రహాన్ని ఏర్పాటుచేసి దానికి సతీష్ ధవన్ మెమోరియల్‌గా నామకరణం చేశారు.

అవార్డులు

1981లో పద్మవిభూషణ్ అవార్డు, ఇందిరాగాంధీ అవార్డును రెండు సార్లు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అవార్డు, కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ టెక్నాలజీ నుంచి అవార్డులను ఆయన పొందారు. ఆయన హయాంలోనే భారత ప్రధానులు ఇందిరాగాంధీ, ఇంద్రకుమార్ గుజ్రాల్, అటల్ బిహారీ వాజ్‌పాయ్ షార్‌కు విచ్చేసి ప్రయోగాలను వీక్షించారు. ఇండియన్ మిస్సైల్ మ్యాన్, భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం కూడా ఆయన ఆధ్వర్యంలో ఇస్రో తొలి ప్రయోగానికి ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా వ్యవహరించారు.

మహిళల ఆరోగ్యమే ప్రధాని మోదీ లక్ష్యం

పెళ్లకూరు: దేశంలో ఉన్న మహిళలంతా ఆరోగ్యంగా జీవించాలన్నదే ప్రధాని నరేంద్రమోదీ జీవితం లక్ష్యమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి అన్నారు. బుధవారం ప్రధాని మోదీ పుట్టిన రోజును పురస్కరించుకొని మండలంలోని పాలచ్చూరు గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించి పౌష్టికాహారం అందజేశారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో మొక్కలు నాటారు.

బదిలీపై వెళ్లిన అధికారికి సత్కారం



సత్కరిస్తున్న సిబ్బంది

సైదాపురం: మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా విధులు నిర్వర్తిస్తూ పదోన్నతిపై దక్కిలి ఎంపీడీఓగా వెళ్లిన రవీంద్రబాబును బుధవారం మండల పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

పెళ్లకూరు: రబీలో పంట సాగు చేసే రైతులకు ఎరువుల సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపడుతున్నట్లు వ్యవసాయ శాఖ ఏడీఏ నాగార్జునసాగర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలో రబీ సాగు పనులకు ఇంకా సమయం ఉండడం వల్ల ఎరువులు దిగుమతి చేసుకోలేదని, పంట సాగు పనులు చేపట్టే నాటికి రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచుతామన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి విజయభారతి మాట్లాడుతూ రైతులందరూ భూసార పరీక్షలు చేసుకుని మేలు రకం విత్తనాలను ఎంపిక చేసుకోవాలన్నారు.

హ్యాకథాన్ విజయవంతం



నగదు బహుమతులు అందజేస్తున్న యూనివర్సిటీ ప్రతినిధులు

గూడూరురూరల్ : పట్టణ సమీపంలోని ఆదిశంకర డీమ్డ్-టు-బి యూనివర్సిటీలో రెండు రోజుల పాటు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2025ను విజయవంతంగా నిర్వహించారు. సమాధన్- సమస్యలు స్ఫూర్తినిచ్చే ఆలోచనలు, పరిష్కారాలు అనే పేరుతో ఐఐసీ, ఏసీఐసీ- ఏఎస్ఐఐసీలతో కలసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ హ్యాకథాన్‌కు విశేష స్పందన లభించిందన్నారు. 74 టీమ్స్, 450 మందికి పైగా విద్యార్థులు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2025 నిర్దేశించిన వివిధ సమస్యలకు సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ ఆధారిత పరిష్కారాలు రూపొందించడంలో చురుగ్గా పాల్గొన్నారు. 24 గంటలపాటు జరిగిన హ్యాకథాన్‌లో ఉత్తమంగా నిలిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ జట్లకు నగదు బహుమతులను అందజేశారు.

వైద్య చికిత్సకు ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

గూడూరురూరల్ : కోవిడ్ కారణంగా మండల కేంద్రానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి వినయ్ బాబు రెండు కాళ్లు, తుంటి ఎముకలు పూర్తిగా చెడిపోవడంతో కాళ్లకు తుంటి మార్పిడి చేయించాలని వైద్యులు సూచించారు. దీంతో ఈ విషయం బాధితులు రోటరీక్లబ్ పాస్ట్ గవర్నర్ మయూరి శ్యామ్ యాదవ్‌కు తెలిపారు. ఈ మేరకు క్లబ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు రెడ్డి, సీనియర్ రొటేరియన్ దశరథరామిరెడ్డితో చర్చించారు. రోటరీ క్లబ్ సభ్యుల సహకారంతో రూ.20,500, బాలాజీ కళాశాల విద్యార్థులు రూ.2000, డిఆర్‌డబ్ల్యూ కళాశాల రోటరాక్ట్ విద్యార్థినుల రూ.1500 కలిపి మొత్తం రూ.24వేలు నగదును మంగళవారం రాత్రి వినయ్ బాబు సతీమణికి అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ జాయింట్ సెక్రటరీ సురేష్‌రెడ్డి, రొటేరియన్లు ఎస్.వి.నాగేంద్రప్రసాద్, మునిగిరీష్, కిరణ్, బలరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం

నాయుడుపేటటౌన్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రభుత్వ, కళాశాలలు ఉన్నత పాఠశాలలు, కార్యాలయాల్లో మొక్కలు పెంపకం చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.

మౌనంగా రెవెన్యూ శాఖ

బాలాయపల్లి(సైదాపురం): భూ సమస్యలపై రెవెన్యూశాఖ మౌనంగా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో పల్లిపాడు, కోటంబేడు, గ్రామస్తుల భూ సమస్యలపై నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ పల్లిపాడులో ప్రభుత్వ భూమిని గత 15 ఏళ్ల నుంచి దళితులు, గిరిజనులు సామాజిక తరగతుల వారు ఆ భూములు సాగుచేసుకుంటున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి రెవెన్యూ భూములా .. అటవీ శాఖ భూములా అని తేల్చకుండా నిర్లక్ష్యంగా చేస్తున్నారన్నారు. అటవీ అధికారులు పేదల జోలికి వస్తే ఊరుకునేది లేదన్నారు.

ఎన్ఎస్ఎస్ దినోత్సవం

గూడూరురూరల్ : పట్టణంలోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనికి పట్టణానికి చెందిన కళాశాల పూర్వ విద్యార్థి జీఎస్‌టీ ప్రాక్టీషనర్ ఇన్ డైరెక్ట్ ట్యాక్సెస్, అడ్వకేట్ కోట సునీల్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి తనవంతు సాయంగా రూ.50 వేలు విరాళం ప్రకటించారు.

కండలేరులో 53.480 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 53.480 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 10,100 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 590, పిన్నేరుకాలువకు 90, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 30, మొదటిబ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ఎంపీడీఓగా రామ్మోహన్‌రెడ్డి



సైదాపురం: ఎంపీడీఓగా ఎంవి రామ్మోహన్‌రెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ప్రకాశం జిల్లాలో డిప్యూటీ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఎంపీడీఓగా వచ్చారు. కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పేదలను ఆర్థికంగా ఆదుకోవాలి

ఓజిలి: పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు పీ-4 కార్యక్రమంలో ఎంతో ఉపయోగపడుతుందని ఎంపీడీఓ నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయం సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ సంపద అధికంగా ఉన్న కుటుంబాల నుంచి అట్టడుగున ఉన్న కుటుంబాలకు సాయం చేసేలా చూడాలన్నారు. మండలంలో ఎంపిక చేసిన బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని ఆర్థికంగా ప్రోత్సాహం కల్పించాలని సూచించారు.

8 గంటల పని విధానాన్నే కొనసాగించాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

గూడూరురూరల్/వెంకటగిరిరూరల్: ప్రపంచ వ్యాప్తంగా కార్మికవర్గం పోరాడి సాధించుకున్న పని గంటల చట్టం ప్రకారం రోజుకు 8 గంటల పని విధానాన్నే కొనసాగించాలని సీఐటీయూ పట్టణ ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య, సీఐటీయూ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు డిమాండ్ చేశారు. గూడూరులోని టవర్‌క్లాక్ సెంటర్, వెంకటగిరి తహసీల్దార్ కార్యాలయం వద్ద వద్ద సీఐటీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పని గంటల పెంపు నిర్ణయానికి ముందు కార్మిక సంఘ ప్రతినిధులతో కానీ, ప్రజా సంఘాల నాయకులతో కానీ కనీసం కార్మికులతో కూడా చర్చలు జరపకుండానే క్యాబినెట్‌లో బిల్లులను ఆమోదింపచేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన 13 గంటల పని విధానాన్ని వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

సైదాపురంలో పీ4పై అవగాహన



బయటే కూర్చున్న సిబ్బంది

సైదాపురం: సైదాపురం ఎంపీడీఓ కార్యాలయంలో పీ-4 కార్యక్రమానికి సంబంధించి మొబైల్ అప్లికేషన్‌పై మండలంలోని సచివాలయ సిబ్బందికి డిప్యూటీ ఎంపీడీఓ మరళీకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. పీ-4పై ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన అవగాహన సదస్సుకు సిబ్బంది అందరూ హాజరుకావడంతో సమావేశ మందిరంలో సీట్లు సరిపోక బయటే కూర్చోవాలిన పరిస్థితి ఏర్పడింది. దీంతో సిబ్బంది అవగాహన తెలియక ఇబ్బందులు పడ్డారు.

పవన్ కల్యాణ్ కటౌట్ దగ్ధం



వెంకటగిరి రూరల్: ప్రముఖ సినీ హీరో, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నటించిన ఓజీ సినిమా గురువారం విడుదల కానున్న నేపథ్యంలో పట్టణంలోని శ్రీభ్రమరాంబ థియేటర్ వద్ద బుధవారం ఏర్పాటు చేసిన ఓజీ మూవీ పవన్‌కల్యాణ్ కటౌట్ ప్రమాదవశాత్తు రాత్రి దగ్ధమయింది. గమనించిన అభిమానులు మంటలను అదుపుచేశారు.

చెత్త నిల్వ లేకుండా చూడాలి

దక్కిలి: గ్రామాల్లో చెత్త నిల్వ లేకుండా ఏ రోజుకు ఆరోజు పరిశుభ్రంగా ఉండేలా క్లాప్ మిత్రలు చూడాలని ఎంపీడీఓ రవీంద్రబాబు తెలిపారు. మండలంలోని దగ్గవోలు గ్రామాల్లో చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఆయన బుధవారం పర్యవేక్షించారు.

మహిళల ఆరోగ్యమే లక్ష్యం



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ భవాని, వైద్యులు ప్రమీల రాజకుమారి

రాపూరు: మహిళలు ఆరోగ్యంగా ఉండడమే వైద్యశాఖ లక్ష్యమని ఎంపీడీఓ భవాని పేర్కొన్నారు. మండలంలోని వేపినాపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం స్వస్థ్ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటే బలమైన కుటుంబాలు ఏర్పడుతాయన్నారు. అనంతరం పలు రకాల వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. మండలంలోని సైదాదుపల్లి గ్రామంలో వైద్యులు సుదర్శనమ్మ మహిళ ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



సూళ్లూరుపేట : అన్నపూర్ణ అలంకారంతో చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారు

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. అందులో భాగంగా అమ్మవారు బుధవారం రాత్రి వివిధ రకాల అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

-సాక్షి నెట్‌వర్క్



రాపూరు: గాయత్రిదేవిగా అంకమ్మ తల్లి



చిట్టమూరు : గాయత్రీ దేవిగా కామాక్షమ్మ



కోట: రాజరాజేశ్వరీ దేవిగా కన్యకా పరమేశ్వరి



వెంకటగిరి: అన్నపూర్ణా దేవిగా కాత్యాయని



నాయుడుపేట : పార్వతీ దేవిగా మూగాంబికాదేవి



గూడూరు : శ్రీగాయత్రీదేవి అలంకరణలో గంగమ్మ



గూడూరు : బండాసుర వధగా నారాయణమ్మ పేరంటాలు అమ్మవారు



చిల్లకూరు: ధాన్యలక్ష్మిగా దర్శనమిస్తున్న ఆదిలక్ష్మీ అమ్మవారు

గర్భిణులకు చీరల పంపిణీ



సారె అందజేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

గూడూరురూరల్ : మండలంలోని తిప్పవరప్పాడు గ్రామంలో బుధవారం చెన్నూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్(ఎస్ఎన్ఎస్‌పీఏ) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని గర్భిణులకు సీమంతం నిర్వహించి చీరలు పంపిణీ చేశారు.

సామాజిక స్పృహను పెంపొందించాలి

బాలాయపల్లి(సైదాపురం): సామాజిక సేవ ద్వారా విద్యార్థులతో బాధ్యత, నాయకత్వం లక్షణాలు, సామాజిక స్పృహను పెంపొందించాలని ఎన్ఎస్ఎస్ అధికారి మునేందు పేర్కొన్నారు. మండలంలోని వెంగమాంబపురం గ్రామంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్‌పై విద్యార్థులకు అవగాహనతోపాటు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

వేడుకగా కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవార్లు

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న వ్యూహలక్ష్మీ సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను బుధవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు అక్టోబర్ 3వ తేదీ వరకు ప్రతి రోజు ప్రత్యేక పూజలతో వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చదలవాడ మోహన్‌కృష్ణ శర్మ తెలిపారు. స్వామివార్లకు బుధవారం ధ్వజారోహణంతో ప్రత్యేక పూజలు జరిపి బ్రహోత్సవాలను ప్రారంభించారు.

క్లుప్తంగా

పశువులకు గాలికుంటు నిరోధక టీకాలు

చిట్టమూరు: మండలంలోని అరవపాళె గ్రామంలో గురువారం పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను స్థానిక పశువైద్యాధికారి సురేంద్ర వేశారు. ఆయన మాట్లాడుతూ, పశువుల్లో తీవ్రమైన జ్వరం, నోటి నుంచి చొంగ కారడం, కాలి గిట్టల మధ్య పుండ్లు వంటివి రావడం గాలికుంటు వ్యాధి లక్షణాలుగా గుర్తించి టీకాలు వేయించుకోవాలని కోరారు. మండలంలో ఇప్పటి వరకు 10 వేల పశువులకు టీకాలు వేశామని, ఈ టీకాలు వేస్తే పాల ఉత్పత్తి ఏమీ తగ్గదని స్పష్టం చేశారు.

భూ సమస్యను పరిశీలించి న్యాయం చేస్తాం!

చిట్టమూరు: మండలంలోని పిట్టివానిపల్లెలో వివాదాస్పదంగా మారిన భూ సమస్యను పరిశీలించి న్యాయం చేస్తామని తహసీల్దార్ నరేష్ గురువారం తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ, గతంలో గ్రామానికి చెందిన నుంజల పద్మమ్మ అనే మహిళకు సర్వే నంబర్ 36.1ఎఫ్‌లో 0.65 సెంట్లు అసైన్‌మెంట్ భూమికి పట్టా ఇచ్చారన్నారు. అయితే అప్పట్లో సబ్‌డివిజన్ కాలేదన్నారు. అప్పటి నుంచి ఆ పొలాన్ని సాగు చేస్తోందని, నీటి సమస్య తలెత్తడంతో బీడుగా వదిలేసిందన్నారు. మరలా సాగు చేయడానికి ఆమె సిద్ధం కావడంతో గ్రామస్తులు దేశమ్మ గుడికి ఆ భూమిని వదిలేయాలని పంచాయతీ సర్పంచ్ పి. ప్రవీణ్‌కుమార్, కొందరు గ్రామస్తులు తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. దీంతో భూ వివాదం రేగింది. ఇరిగేషన్, తమ శాఖ సిబ్బంది సర్వే చేసి, సబ్ డివిజన్ చేసి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని తహసీల్దార్ చెప్పారు. అప్పటి వరకు ఎవరూ భూమిలోకి ప్రవేశించరాదని ఆయన హెచ్చరించారు.

ఏపీటీఎఫ్ విద్యాభవన్ నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు

నాయుడుపేటటౌన్: స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో గురువారం ఏపీటీఎఫ్ విద్యా భవన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. స్థలం కొనుగోలు చేసి భవన్ నిర్మాణానికి పూనుకున్నట్టు నాయకులు చెప్పారు. కార్యక్రమంలో మండల ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అల్లెయ్య, ఎల్.మురళి, నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి, దొరవారిసత్రం తదితర మండలాల ఏపీటీఎఫ్ నాయకులు సీహెచ్ నరసింహారావు, చంద్రశేఖర్ బాబు, రజనీబాబు, దయాకరయ్య, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితులపై వివక్ష చూపొద్దు


ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వెంకటగిరి రూరల్: పట్టణంలోని సవారిగుంట ప్రాంతంలో నవజీవన్ అర్గనైజేషన్ సీసీపీయూ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టు మేనేజర్ బాలాజీ మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపరాదని విజ్ఞప్తి చేశారు. ఎయిడ్స్ వ్యాప్తి, దాని బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం పలువురికి హెచ్ఐవీ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఓఆర్‌డబ్ల్యూఓ వి.మునికుమారి, ఏఎస్ఎస్ జి.శ్రీలత, పీఈలు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన


(చిట్టమూరు) : అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి మదన్‌మోహన్

చిట్టమూరు: మండలంలోని కొక్కుపాళెంలో గురువారం గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మల్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి మదన్‌మోహన్ వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మహిళలు తీసుకోవాల్సిన పోషకాహారం గురించి డాక్టర్‌తోపాటు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దేవసేన అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కండలేరులో 54.350 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 54.350 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 10.100 క్యూసెకుకల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 590, పిన్నేరు కాలువకు 90, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వివరించారు.

చికెన్ ధరలు 26-09-2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	:	115
లేయర్ లైవ్	:	110
బ్రాయిలర్ చికెన్	:	210
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	232
లేయర్ చికెన్	:	187

కర్లపూడిలో సిలికా బకాసురులు

- కూటమి పాలనలో పావులు కదుపుతున్న పెద్దలు
- టీడీపీ నేతల అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు చేస్తాం


మాట్లాడుతున్న చెంచురాఘవరెడ్డి


సిలికా మైన్‌లోకి వాహనాలు వెళ్లడానికి అనువుగా చేసిన పనులు

కోట: మండలంలోని కర్లపూడి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 107లో సిలికా మైన్ అనుమతులను రద్దు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. గురువారం గ్రామస్తులతో కలసి సిలికా మైన్‌ను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు సన్నారెడ్డి చెంచురాఘవరెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, సర్వేనంబర్ 107లో 80 ఎకరాల విస్తీర్ణంలో సిలికాను తవ్వి తరలించేందుకు కూటమి ప్రభుత్వంలో పెద్దలు పావులు కదుపుతున్నారన్నారు. గతంలో ఇక్కడ సిలికా మైన్ కోసం ఓ సంస్థకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. దీనిపై ప్రజాభిప్రాయ సేకరణలో వ్యతిరేకించడంతో అనుమతి రద్దు అయినట్లు తెలిపారు. ఇపుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఓ ముఖ్య ప్రజాప్రతినిధి రంగంలోకి దిగి సిలికాను కొల్లగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, ప్రశాంతినగర్ గిరిజన కాలనీకి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

టీడీపీ నేతల అక్రమ తవ్వకాలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. దీనిపై తహసీల్దార్ జయజయరావును వివరణ కోరగా.. తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. మైనింగ్ అధికారులే విచారణ చేయాలన్నారు.

గరుడ వాహనంపై శ్రీవారి చిద్విలాసం


బంగారు గరుడ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి గురువారం రాత్రి మేళతాళాలు, మంగళవాయిద్యాల హోరు నడుమ బంగారు గరుడ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తొలుత ఉదయం 4 గంటలకు అభిషేకం, ఆ తర్వాత సుప్రభాతం, మూలమూర్తికి చందన అలంకరణ, శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో శాంతి హోమం, కల్యాణోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కోన వీధులు భక్తుల గోవింద నామస్మరణలతో మార్మోగాయి.

పోషకాహారంపై అవగాహన ముఖ్యం


అంగన్‌వాడీ కేంద్రంలోఅవగాహన కల్పిస్తున్న సీడీపీఓ ఉమామహేశ్వరి తదితరులు

నాయుడుపేటటౌన్: పోషకాహారంపై అందరూ అవగాహన కలిగి ఉండాలని సీడీపీఓ ఉమామహేశ్వరి అన్నారు. గురువారం నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల్లోని పలు అంగన్‌వాడీ కేంద్రాలలో పోషకాహార మాసోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. సీడీపీఓ అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మణెమ్మ, సాయిలక్ష్మి, ఎం.పోలమ్మ, సీహెచ్ హేమలత, టాటా ట్రస్ట్ తకో-ఆర్డినేటర్ అశోక్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.


పౌష్టికాహారంపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

పెళ్లకూరు: అంగన్‌వాడీ కేంద్రాలు పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యవంతులుగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ ఉమామహేశ్వరి అన్నారు. గురువారం పుల్లూరు, ముమ్మారెడ్డిగుంటలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం-ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. తల్లిపాల ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. జంక్ ఫుడ్‌కు పిల్లలను దూరంగా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సాయిలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు, బాలింతలు పాల్గొన్నారు.

బాల్య దశ సంరక్షణపై దృష్టి


ఏరూరులో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఏడుకొండలు

చిల్లకూరు: తల్లిదండ్రులు తమ పిల్లల బాల్య దశ సంరక్షణపై దృష్టి పెట్టాలని చింతవరం వైద్యులు ఏడుకొండలు అన్నారు. మండల తీర ప్రాంతంలోని ఏరూరు సచివాలయంలో గురువారం రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలలో భాగంగా బాల్య దశ సంరక్షణపై తల్లిదండ్రులకు ఏడుకొండలు అవగాహన కల్పించారు. చిన్నతనం నుంచే క్రమశిక్షణతో పెంచాలని, జంక్‌ఫుడ్ పెట్టరాదని కోరారు. అలాగే ఓడూరు అంగన్‌వాడీ కేంద్రంలో చిల్లకూరు వైద్యులు అరాఫత్ కూడా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'అమృత భారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్'కు స్టాపింగ్


లోకో పైలెట్లను సత్కరించిన రైల్వే ప్యాసింజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

నాయుడుపేటటౌన్: ఈ రోడ్ నుంచి జోగ్బాని(బిహార్)కు వెళ్లే అమృత భారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌ను గురువారం నుంచి నాయుడుపేటలో స్టాపింగ్ సౌకర్యం కల్పించారు. సదరన్ రైల్వే ప్రయాణికుల సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ మీజూరు మస్తానయ్య, డీఆర్‌యుసీసీ సభ్యులు పేర్నాటి జోసెఫ్ సారథ్యంలో ఘనంగా స్వాగతించారు. ఆ ట్రైన్ లోకో పైలెట్లు అజయ్ బాబు, దినేష్‌కు పూలమాలలు వేసి సత్కరించారు. వెళ్లేటప్పుడు ప్రతి గురువారం సాయంత్రం 4 గంటలకు, తిరుగు ప్రయాణంలో ప్రతి మంగళవారం రాత్రి 8.58 గంటలకు నాయుడుపేటలో ఈ ట్రైన్ నిలుస్తుందన్నారు. స్టాపింగ్ సౌకర్యం కల్పనకు కృషి చేసిన ప్రజాప్రతినిధులు, రైల్వే ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ చిరంజీవి, అసోసియేషన్ నాయకులు సుల్తాన్, కిరణ్, నరసయ్య, శంకర్‌లాల్, రాఘవన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్‌బీఐ వార్షికోత్సవం


ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ సీనియర్ ఖాతాదారులతో బ్యాంకు అధికారులు

సూళ్లూరుపేట: పట్టణంలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్‌లో 60 వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ ఖాతాదారులతో సమావేశం ఏర్పాటు చేసి రీజినల్ మేనేజర్ సత్యనారాయణ మాట్లాడారు. సూళ్లూరుపేట ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో ఇక్కడ ఖాతాదారుల సంఖ్య 80 వేలకు పెరిగి బ్యాంకు టర్నోవర్ కూడా బాగా పెరిగిందని ప్రగతిని వివరించారు. ప్రస్తుతం రూ.306 కోట్ల రుణాలు, రూ.167 కోట్ల డిపాజిట్లుతో బ్యాంకు టర్నోవర్ ఉందని చెప్పారు. ఖాతాదారుల సౌకర్యార్థం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని, ఏటీఎంల సంఖ్య పెంచామన్నారు. ఖాతాదారులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ చీఫ్ మేనేజర్ కశిరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఖాతాదారులు డాక్టర్ సాయిబాబా, కాళంగి ప్రభాకర్, వాకిచర్ల రమేష్, సురేంద్రరెడ్డి, భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.

డ్రమ్‌సీడర్ వాడకంపై అవగాహన


డ్రమ్ సీడర్‌పై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రాజీవన

వెంకటగిరి రూరల్: పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు వ్యవసాయంలో డ్రమ్‌సీడర్ వాడకం, దాని ఉపయోగాలపై గురువారం రైతులకు శాస్త్రవేత్త రాజీవన అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ వరిసాగులో కూలీల ఖర్చు తగ్గించుకోవడానికి డ్రమ్‌సీడర్‌తో నాట్లు వేసుకోవచ్చని, అలాగే మొక్కల సాంద్రత పాటిస్తూ త్వరగా పంట కోత చేసుకోవచ్చన్నారు. కలుపు యాజమాన్యంపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు విజయశ్రీ, నాగార్జునరెడ్డి, తిరుపాల్, టీవీఎస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.


ఉద్యానవన పంటలపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

ఉద్యాన పంటలపై...

పట్టణంలోని కృషివిజ్ఞాన కేంద్రంలో రాస్ కృషి విజ్ఞాన కేంద్రం తిరుపతి, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (న్యూఢిల్లీ), వ్యవసా య సాంకేతిక యాజమాన్య సంస్థ (చిత్తూరు) ఆధ్వర్యంలో గురువారం రైతు విజ్ఞాన యాత్రలో భాగంగా రైతులకు ఉద్యానవన పంటలపై అవగాహన కల్పించారు. వివిధ పంటల్లో సాంకేతిక పరిజ్ఞానం, యాజమాన్య పద్ధతులు, అధిక దిగుబడుల సాధనకు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

నివాళి



పెళ్లకూరు: మండలంలో జీలపాటూరుకు చెందిన శతాధిక వృద్ధుడు ఆరూరు రామయ్య(103) కుటుంబ సభ్యులను గురువారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి పరామర్శించారు. రామయ్య ఇటీవల మృతి చెందడంతో గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత డాక్టర్ పాలూరు మహేంద్రరెడ్డితో కలిసి రామయ్య చిత్ర పటానికి పూలమాలలు వేశారు. నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సర్పంచ్ పగడాల హరిబాబురెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సతీష్ ధవన్‌కు ఘన నివాళి

- భారత్‌కు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించిన తొలితరం శాస్త్రవేత్త
- జయంతి వేడుకల్లో స్మరించిన షార్ డైరెక్టర్ పద్మకుమార్


షార్ సెంటర్‌లోని జీరో పాయింట్ వద్ద సతీష్ ధవన్ మెమోరియల్ వద్ద నివాళులు అర్పిస్తున్న షార్ శాస్త్రవేత్తలు

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష ప్రయోగాల్లో ప్రొఫెసర్ సతీష్ ధవన్ అత్యంత సాంకేతిక పరమైన ప్రయోగాలకు శ్రీకారం చుట్టిన మొదటి తరం శాస్త్రవేత్తగా చరిత్రకెక్కారని షార్ అసోసియేట్ డైరెక్టర్ ముత్తు చైళియన్ ప్రస్తుతించారు. భారత అంతరిక్ష పితామహుల్లో ముఖ్యులైన ప్రొఫెసర్ సతీష్ ధవన్ 104వ జయంతిని గురువారం షార్ కేంద్రంలోని గగన్‌యాన్ మిషన్ కంట్రోల్ రూంలో ఘనంగా నిర్వహించారు. తొలుత షార్ రెండోగేట్ సమీపంలోని జీరోపాయింట్ వద్ద సతీష్ ధవన్ మెమోరియల్‌ను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి ఆయన విగ్రహానికి, మిషన్ కంట్రోల్ రూంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. డైరెక్టర్ మాట్లాడుతూ, భారత అంతరిక్ష ప్రయోగాలను తొలితరం శాస్త్రవేత్త డాక్టర్ విక్రమ్ సారాభాయ్ బుడి బుడి అడుగులతో నడిపిస్తే, సతీష్ ధవన్ దానికి నడక నేర్పించడంతో ప్రస్తుతం ప్రపంచంలోనే ఇస్రో బలీయమైన సంస్థగా ఆవిర్భవించిదన్నారు. సతీష ధవన్ ఆధ్వర్యంలో భారత అంతరిక్ష ప్రయోగాల పరంపర ప్రారంభమైందని, ఇస్రో తొలినాళ్లలో చిన్న తరహా రాకెట్ ప్రయోగాలు మొదలు ప్రస్తుతం చంద్రయాన్-3, ఆదిత్య ఎల్1వరకు, పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ రాకెట్ల ప్రస్థానం, సౌండింగ్ రాకెట్లు, 40 కిలోల బరువు కలిగిన చిన్నపాటి ఉపగ్రహాలను పంపించే స్థాయి నుంచి ప్రస్తుతం ఆరు టన్నుల బరువు కలిగిన అన్ని రకాల ఉపగ్రహాలను సొంతంగా తయారు చేసుకుని ప్రయోగించే వరకు ఎదిగిన వైనం, సాధిస్తున్న విజయాల వెనుక అప్పట్లో ఆయన వేసిన పునాదులేనని ఉత్తేజభరితంగా ప్రసంగించారు. ఆయన సేవలను కీర్తించారు. అలాగే, స్థానిక కేఆర్‌పీ కాలనీ సమీపంలోని సతీష్ ధవన్ మెమోరియల్ ఆసుపత్రిలో కూడా సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో షార్ కంట్రోలర్ రమేష్ కుమార్, షార్ అధికారులు పీ.గోపీకృష్ణ, అన్ని విభాగాల అసోసియేట్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి


టిడ్కో అపార్ట్‌మెంట్‌లో పార్కులను శుభ్రం చేస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

గూడూరు రూరల్: ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు కోరారు. స్వచ్ఛతా హీ కార్యక్రమంలో భాగంగా పట్టణ సమీపంలోని టిడ్కో అపార్ట్‌మెంట్ల వద్ద గురువారం పార్కులు, పరిసర ప్రాంతాలను సిబ్బందితో కలసి కమిషనర్ శుభ్రం చేసి మాట్లాడారు. నివాసాల్లో మంచినీరు ఎక్కువ రోజులు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.


సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట: పట్టణంలో గురువారం ఏక్ దిన్-ఏక్ గంట-ఏక్ సాత్ పేరుతో శ్రమదాన కార్యక్రమం, స్వచ్ఛత ఉత్సవ్-2025 పేరుతో పలు కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య ఆధ్వర్యంలో మున్సిపల్ ఆఫీస్, సచివాలయ, పారిశుధ్య, మెప్మా సిబ్బంది స్థానికులతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల, మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించారు. ప్రజలకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా తప్పదని కమిషనర్ హెచ్చరించారు. ఇళ్ల వద్ద తడి, పొడిచెత్తను వేర్వేరుగా పారిశుధ్య కార్మికులకు అందజేయాలని కోరారు.

జీతాలు చెల్లించండి


తడకండ్రిగ సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

తడ: మండలంలోని తడకండ్రిగ సచివాలయంలో పని చేస్తున్న సిబ్బందికి వెంటనే జీతాలు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శిని ఎంపీడీఓ శేఖర్‌నాయక్ గురువారం ఆదేశించారు. పంచాయతీలో 11మంది పారిశుధ్య కార్మికులతోపాటు ఇతర ఉద్యోగులకు రెండు నెలలుగా జీతాలు ఇవ్వలేదు. దీనిపై ఆందోళన చేయడానికి సిద్ధమయ్యారు. ఇది తెలుసుకున్న ఎంపీడీఓ సచివాలయానికి చేరుకుని పంచాయతీ కార్యదర్శి గాబ్రియేల్, సిబ్బందిని ప్రశ్నించారు. వాస్తవానికి తడకండ్రిగ ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శిగా కళా గాబ్రియేల్ కొనసాగుతుండగా రెండు నెలల క్రితం కలెక్టర్ కార్యాలయం నుంచి జానకిరామయ్యను రెగ్యులర్ కార్యదర్శిగా నియమించారు. అయితే స్థానిక రాజకీయ కారణాల వల్ల జానకిరామయ్య ఇప్పటి వరకు బాధ్యతలు స్వీకరించలేదు. దీంతో ప్రస్తుత ఇన్‌చార్జ్ కార్యదర్శి ఆచితూచి వ్యవహరిస్తూ ఉండటంతో జీతాలు పెండింగ్‌లో పడ్డాయి. దీనిపై ఎంపీడీఓ స్పందించారు.

సకాలంలో ఆదాయం పన్ను చెల్లించండి


మాట్లాడుతున్న ఆదాయపు పన్ను అధికారి ఆషిష్‌కుమార్

గూడూరు రూరల్: ఆదాయం పన్నులను సకాలంలో చెల్లించాలని ఆదాయపు పన్ను అధికారి ఆషిష్ కుమార్ కోరారు. గురువారం గూడూరులో ఆదాయపు పన్ను శాఖ ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో ఇన్‌కం ట్యాక్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ పాన్- ఆధార్ లింకింగ్, ఐటీఆర్‌లు సమయానికి దాఖలు చేయాలన్నారు. ఆలస్యంగా రిటర్న్ దాఖలు చేస్తే అది చూపే ప్రభావం, పాత పన్ను, కొత్త పన్నుల విధానాల ఫీచర్లను వివరించారు. రిటర్న్ ఈ-వెరిఫికేషన్, ఏఐఎస్ పోర్టల్ వినియోగం, తప్పుడు రీఫండ్ క్లెయిమ్‌ల పరిణామాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్లు రామ్మోహన్‌రావు, మోహన్, లెమన్ అసోసియేషన్ చెందిన తలమంచి సిద్ధారెడ్డి, బిల్లు పెంచలయ్య, సోమిశెట్టి చెంచురామయ్య, వాణిజ్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇద్దరికి 'ఆప్తా' ఉపకార వేతనాలు


చర్చిస్తున్న బలిజ మహిళా సంక్షేమ సంఘం సభ్యులు

చిల్లకూరు: బలిజ మహిళా సంక్షేమ సంఘం సిఫార్సు చేసిన ఇద్దరు పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఉపకార వేతనాలు ఇవ్వడానికి ఆప్తా(అమెరికాలోని అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్) ముందుకు వచ్చిందని సంఘం అధ్యక్షురాలు ఆర్.పద్మావతి తెలిపారు. గురువారం గూడూరులో వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలోని సునీతా సేవా సంస్థ కార్యాలయంలో బలిజ మహిళా సంక్షేమ సంఘ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ ఏడాదిలో చేయవలసిన సేవా కార్యక్రమాల ప్రణాళికలను సిద్ధం చేశారు. ఆప్తా సంస్థ నామాల దుర్గాదేవి, పోకల పవన్ సాయికి ఉప కార వేతనం ఇవ్వనున్నట్టు తెలిపారు. సమావేశంలో గౌరవాధ్యక్షులు సారంగం సులక్ష్మి, కార్యదర్శి ఇస్కా సువర్ణలక్ష్మి, అరుణ, ఉమాదేవి, ఉష, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

8 గంటల పని విధానం కోసం ధర్నా



అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

గూడూరు రూరల్: ప్రపంచ వ్యాప్తంగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానాన్నే కొనసాగించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం గూడూరు టవర్‌క్లాక్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద ఏఐటీయూసీ నాయకులు ధర్నా చేశారు. కార్మికుల శ్రమదోపిడీకి 10 నుంచి 13 గంటల పని విధానాన్ని ప్రవేశపెట్టడం ఎంతమాత్రమూ సరికాదని నిరసించారు. మహిళల భద్రత దృష్ట్యా నైట్ షిఫ్ట్‌లను తొలగించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు సునీల్, బిల్డింగ్ వర్కర్స్ నాయకులు మీరాభాయి, శ్రీనివాసులు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మాతా నమోస్తుతే..!

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం వివిధ ప్రాంతాల్లో అమ్మవారు బహు రూపాల్లో భక్తులను అనుగ్రహించారు. ఆయా దేవాలయాల్లో అమ్మవారిని విశేషంగా అలకరించి, అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, హోమాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు, ఉభయదారులు పాల్గొన్నారు.

-సూళ్లూరుపేట, నాయుడుపేట, గూడూరు రూరల్, రాపూరు, చిట్టమూరు, చిల్లకూరు



రాపూరు-పెంచలకోనలో ధైర్యలక్ష్మి అలంకరణలో ఆదిలక్ష్మీదేవి, పెంచలకోనలో విశ్వశాంతి ఆశ్రమంలో హోమం నిర్వహిస్తున్న విజయేశ్వరిదేవి




సూళ్లూరుపేటలో..., నాయుడుపేటలో...





గూడూరు రూరల్: కాత్యాయని దేవి, రజత కవచ అలంకారంలో..., చిట్టమూరులో..., చిల్లకూరులో..